క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా దారా మోషే



శావల్యాపురం: నరసరావుపేట డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన దారా మోషే నియమితులయ్యారు ఈ మేరకు ఆర్టీవో నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ భీమని అంకారావు వైస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

ఈపూరు: మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో పంటకోత ప్రయోగాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఓబులశెట్టి చెన్నారావు వరిపొలంలో 5''5 కొలతల విస్తీర్ణంలో వరి కంకులను నూర్పగా ఎకరానికి 38 బస్తాల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఈ సందర్భంగా మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ కె. నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ అకాల వర్షాలవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగాలలో దిగుబడులు ఆశాజనకంగా వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు గాలం యతీంద్రనాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగపు అధ్యక్షుడిగా నరేష్

శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామానికి చెందిన మలిశెట్టి నరేష్‌ను మండల యువజన విభాగపు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బుధవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భీమని అంకారావు, రాష్ట్ర కాపు యువ సేన సంఘం అధ్యక్షులు కర్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేతలు తెలప్రోలు రవీంద్ర బాబు, వడ్రాణం నాగేశ్వరరావు, బండారు మణికంత పాల్గొన్నారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 14వ బ్యాచ్ అభ్యర్థులకు డిపో మేనేజర్ బి.వీరాస్వామి బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా శిక్షణ తీసుకున్న వారికి ప్రమాదాల నివారణ, ఇంధనం పొదుపు గురించి వివరించారు. అలాగే 15వ బ్యాచ్ శిక్షణకు ప్రవేశాలు జరుగుతున్నాయని, శిక్షణ పొందగోరు లైట్ మోటార్ లైసెన్స్ డ్రైవర్లు 7382896038 9959225428 నంబర్లను సంప్రదించాలని కోరారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చిన ఎస్‌డీఐ సీహెచ్.మోహనరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొప్పూడి విద్యార్థినుల నమూనా



చిలకలూరిపేట టౌన్: జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమస్థానం సాధించిన బొప్పూడి గ్రామంలోని జెడ్పీహైస్కూల్ విద్యార్థులు రూపొందించిన నమూనా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు చెప్పారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి అభ్యసించే విద్యార్థినులు మౌనిక, వైష్ణవి సంయుక్తంగా రూపొందించిన సోలార్ ఫిజికల్ ఛాలెంజ్డ్ సర్జికల్ చైర్ నమూనా రాష్ట్రస్థాయి పోటీ ప్రదర్శనకు ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం శారీరక వైకల్యం రోగి ఎలాంటి అదనపు మానవ ప్రయత్నం చేయకుండా కాలుష్యం రహితంగా ప్రయాణించ వచ్చన్నారు. దీనిని ఈనెల 28,29 తేదీల్లో కడప జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో పాల్గొనే అర్హత సాధించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

వలస కార్మికుడు ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా చుండూరు మండలం మండూరు గ్రామానికి చెందిన పోట్లూరి వెంకటేశ్వర్లు కుటుంబం ఉపాధి నిమిత్తం కొద్దినెలల కిందట చిలకలూరిపేట మండలంలోని కమ్మవారిపాలెంకు వచ్చారు. సమీప గ్రామాల్లోని సుబాబుల్ తోటల్లో కర్రకొడుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 26వ తేదీన తెల్లవారు జామున ఉదయం ఇంటి నుంచి వెళ్లిన భర్త ఎంతకూ తిరిగి రాకపోవడంతో భార్య దత్తాద్రి కుమారుడితో కలిసి వెతుకగా గోవిందపురం గ్రామం శివారులోని ఓ వేపచెట్టుకు చీరెతో ఉరివేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండవ రోజు ఆడుదాం ఆంధ్రా

- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు
- నరసరావుపేట మండలంలో 5700 మంది రిజిస్ట్రేషన్
- కిటకిటలాడుతున్న క్రీడా మైదానాలు



ఉప్పలపాడులో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

నరసరావుపేట రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతున్నాయి. మండలంలోని ఐదు క్రీడా మైదానాల్లో మంగళవారం ఆటల పోటీలు జరిగాయి. వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. 19 సచివాలయాల పరిధిలో 47 మ్యాచ్‌లను మంగళవారం నిర్వహించారు. జొన్నలగడ్డ, తిరుమల కళాశాలలో నిర్వహిస్తున్న పోటీలను ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. లింగంగుంట్ల, ఉప్పలపాడు, కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్స్‌తో పాటు తిరుమల, ఎస్ఈసీ ఇంజినీరింగ్ కళాశాలల్లోని క్రీడాప్రాంగణాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి.

మండలంలో 5700 మంది రిజిస్ట్రేషన్..

ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొనేందుకు మండలంలో క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. పురుషుల, మహిళ విభాగాల్లో ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే పోటీలకు 5700 మంది రిజిస్ట్రేషన్స్ చేసుకున్నారు. పురుషుల క్రికెట్-73, కబడ్డీ-39, బాడ్మింటన్-77, వాలీబాల్-38, ఖోఖో-28 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. మహిళ విభాగంలో క్రికెట్-27, కబడ్డీ-27, బాట్మింటన్-87, వాలీబాల్-30, ఖోఖో-33 జట్లు పాల్గొంటున్నాయి. ఆయా పోటీలను పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



జొన్నలగడ్డలో బాడ్మింటన్ క్రీడాకారులకు బ్యాట్స్ అందజేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2వ రోజు ఆటల పోటీలను పాఠశాల కమిటీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్, ఎంపీడీవో వీరభద్రాచారిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. నూజెండ్ల గ్రామ సచివాలయ పరిధిలో రెండు జట్ల మధ్య వాలీబాల్ పోటీలు జరిగాయి. అనంతరం ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ జనవరి 9 వరకు జరిగే పలు విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్

కొచ్చర్లలో...

ఈపూరు:మండలంలోని కొచ్చర్ల గ్రామంలో ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 2వ రోజు ఆటల పోటీలను సర్పంచ్ కోపెల దేవరాజ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లోని యువకుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.తిరుపతయ్య, జి. చిన్న శ్రీనివాసరావు, అరుణ, ఎం.హిమబిందు, కొచ్చర్ల హైస్కూల్ పీడీ రూతు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కొచ్చర్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్ కోపెల దేవరాజ్



యడ్లపాడులో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు మండల కేంద్రంలో 2వ రోజు బుధవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల నుంచి బ్యాడ్మింటన్ 5 టీమ్‌లు, కబడ్డీ 5 టీంలు, క్రికెట్ 8 టీంలు, రెండవ రోజు నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాయని ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా తెలిపారు. ఎంపీపీ బత్తి రాములు క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. యువత క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెల్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.పార్వతి, డీటీ సుధాకర శర్మ, క్రీడాపోటీల మండల కోఆర్డినేటర్ బి.శివానాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ఆడుదాం ఆంధ్రా (ఇది మనందరి ఆట) మెగా టోర్నమెంట్ పోటీలు బుధవారం కొనసాగాయి. గ్రామీణ ప్రాంత బాలబాలికలు, యువతీ, యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభా పాటవాలను అద్భుతంగా ప్రదర్శిస్తూ క్రీడాభిమానుల్ని ఆకట్టుకున్నారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 8 క్రీడా మైదానాల్లో రెండోరోజున మొత్తం 16 క్రీడా పోటీల్ని నిర్వహించారు. వీటిలో క్రికెట్-1, కబడ్డీ-1, బాడ్మింటన్ -14 నిర్వహించగా ఆయా పోటీల్లో 7 పురుష జట్లు, అలాగే మరో ఏడు మహిళా జట్లు పాల్గొని పోటాపోటీగా తలపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదకర వాతావరణంగా ఉత్సాహంగా కొనసాగిన ఈ పోటీలను మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, స్థానిక గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పర్యవేక్షించగా పీఈటీ, పీడీలు పోటీలను నిర్వహించారు.



సొలసలో బాడ్మింటన్ ఆడుతున్న మహిళలు

ఆహ్లాదకర వాతావరణంలో ఆటల పోటీలు



కర్లకుంట గ్రామంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రొంపిచర్ల: మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో ఆహ్లాదకర వాతావరణంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలు నిర్వహించారు. ఈ పోటీలు అలవాల, ఆరేపల్లి, బుచ్చిబాపన్నపాలెం, కర్లకుంట, రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, విప్పర్ల సచివాలయ పరిధిలో నిర్వహించారు. అలవాల సచివాలయ పరిధిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపీపీ గడ్డం వెంకట్రావు ఓ జట్టులో పాల్గొని ఆడారు. ఈ ఆటల పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది నిర్వహించగా, ఎండీవో, తదితర మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ఆడుదాం ఆంధ్రా రెండో రోజు ఆటల పోటీలు చురుగ్గా కొనసాగాయి. మండలంలోని 16 సచివాలయాల్లో ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. తొలిరోజు 14 టీంలు పాల్గొనగా, రెండో రోజు 15 టీంలు పాల్గొన్నాయి. జనవరి 9 వరకూ ఈ పోటీలు జరగనున్నందున మొత్తం మండల పరిధిలో ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలకు గాను 220 టీంలు రిజిస్టరు చేసుకున్నారు. మండలంలోని కనపర్రు గ్రామంలో జరిగిన పోటీల్లో సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు క్రీడాకారులతో బాల్‌బ్యాడ్మింటన్ ఆడి ఉత్సాహ పరిచారు.



బొల్లాపల్లి మండల కార్యాలయాల వద్ద క్రీడాకారులతో ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీడీవో



బ్యాడ్మింటన్ ఆడుతున్న బొల్లాపల్లి క్రీడాకారులు

ఈవీఎంలపై అవగాహన



నాదెండ్లలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

నాదెండ్ల: ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శివాలయం కల్యాణ మండపంలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం ద్వారా ప్రజలు ఎలా ఓటు వినియోగించుకోవాలో వివరించారు. ఈవీఎంల పనితీరును వివరించారు. ఎన్నికల సంఘం జనవరి 5 నుంచి 22 వరకూ ఓటర్ల జాబితా సవరణలకు అవకాశం కల్పించిందన్నారు. 2024 ఎన్నికల జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు జనవరి 12 వరకూ అవకాశం కల్పించినట్లు తెలిపారు. వీటిని 17లోగా పరిష్కరించనున్నారు. 22న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ జాబితా ద్వారానే 2024 సాధారణ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా, ఏఎస్సై రమేష్, వీఆర్వో చైతన్య, సీనియర్ అసిస్టెంట్ మురహరి పాల్గొన్నారు.

రొంపిచర్లలో

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానానంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ జి.అంకారావు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా తమకు ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. ఓటర్లు ప్రలోభాలకు గురి చేసిన వారిపై, భయభ్రాంతులకు గురిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగం పై గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం వెంకట్రావు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్‌సెటిల్డ్ భూములు పరిష్కారానికి కృషి

-కలెక్టర్ శివ శంకర్ లోతేటి



కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గోపిరెడ్డి, అగ్రహారం ప్రతినిధి చంద్రమౌళి

నరసరావుపేట: జిల్లాలో అన్ సెటిల్డ్ భూములు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని క్యాంపు ఆఫీసులో నిర్వహించిన సమావేశంలో లింగంగుంట్ల అగ్రహారం భూములపై చర్చించారు. మూడు నెలల క్రితం భూములపై రైతులు, అగ్రహారం స్వామీజీ మధ్య ఒక ఒప్పందం కుదిరి అగ్రిమెంట్ రాసుకున్న విషయం విధితమే. దీనిపై అసలు భూములు ఎన్ని ఉన్నాయనే దానిపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఆ నివేదికపై పుష్పగిరి పీఠానికి చెందిన చంద్రమౌళి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో కలెక్టర్ చర్చలు నిర్వహించారు. ఎప్పటి నుంచో పరిష్కారం కానీ ఇటువంటి సమస్యలకు త్వరగా పరిష్కారం కనుగొంటే వేలాది మంది భూముల లబ్ధిదారులకు ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్ తరాలకు ఈ సమస్య ఎంతో ఉపశమనం చూపుతుందన్ని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్‌వీ రమణ నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపు క్యాలెండర్ ఆవిష్కరణ

నాదెండ్ల: చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న నడికట్టు రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించనున్నట్లు సభ్యులు యన్నం శివారెడ్డి చెప్పారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి హాజరౌతున్నట్లు చెప్పారు.

వైభవంగా గరుడ మహోత్సవ సేవ



గరుడ వాహనంపై కల్యాణ వెంకటేశ్వర స్వామి

చిలకలూరిపేట: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండప ప్రాంగణంలో ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమత కళ్యాణవెంకటేశ్వరస్వామి గరుడ మహోత్సవ సేవ మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సహ విగ్రహాలను పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మల్లెల రాజేష్ నాయుడు

కనకదుర్గ ఆలయంలో...

పట్టణంలోని భావనారుషి నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో జ్యోతుల కార్యక్రమం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బిట్రా రాజేంద్ర ప్రసాద్, వడితే కోట్యా నాయక్, రమణిబాయి పాల్గొన్నారు.

ముగిసిన ఆరుద్రోత్సవం



వల్లభేశ్వర స్వామి మకరత లింగానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



నగరోత్సవంలో భక్తులను అనుగ్రహిస్తున్న భీమలింగేశ్వర స్వామివారు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగాపార్వతీ సమేత వల్లభేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఆరుద్రోత్సవం బుధవారం ఉదయం పూర్ణాహుతి నిర్వహించారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి భజనా కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల సమయంలో 12 కిలోల కర్పూర జ్యోతిని ప్రజ్వలింప చేశారు. కర్పూర జ్యోతి ప్రజ్వలన అనంతరం వల్లభేశ్వర స్వామి వారికి మహన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకా లు, రుద్ర హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ నిర్వహించగా, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా ఆరుద్రోత్సవం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం ఆరుద్రోత్సవం (శివ ముక్కోటి)ను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణలు జరిపారు. ఆలయ ప్రధాన ద్వారానికి ప్రక్కనే ఉన్న ద్వారం వద్ద నంది వాహనంపై గంగా, పార్వతీ అమ్మవార్లతో భీమలింగేశ్వర స్వామివారి ఉత్సవ మూర్తిని అలంకరించి భక్తులకు ద్వార దర్శనం కల్పించారు. అనంతరం వృషభ వాహనంపై నగరోత్సవం నిర్వహించారు.

వంద రోజుల పనిదినాలు కల్పించాలి




సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించటానికి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి పథకంలో వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న పదోవ తరగతి ఆపైన చదువుకున్న నిరుద్యోగులకు ఉన్నతి పథకం ద్వారా వారి నైపుణ్యాలు ఆధారంగా ప్రభుత్వ పరంగా మూడు నుంచి నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణతో పాటు భోజన వసతి కల్పించి అనంతరం ఉపాధి కల్పించటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. శిక్షణ కాలంలో 90 శాతం హాజరు కలిగిన వారికి రోజుకు రూ. 272 రూపాయల చొప్పున స్టైపెండ్ రూపంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్నతి పథకంలో అర్హత కలిగి ఉన్న వారిని గుర్తించాలన్నారు. శిక్షణాంతరం ప్రముఖ ప్రవేటు కంపెనీలలో గ్యారెంటీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నెలకు వేతనం రూ. 15 వేల నుంచి 25 వేల వరకు నామ్స్ ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏపీవో రామారావు, జేఆర్‌పీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గొడవపడి ఇరువురికి గాయాలు

యడ్లపాడు: మద్యం సేవించే ప్రాంతంలో జరిగిన గొడవ కారణంగా ఇద్దరు గాయపడ్డ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మర్రిపాలెం గ్రామానికి చెందిన కొర్రపాటి ప్రశాంత్, కొమ్మూరి ప్రేమ్‌చంద్‌లు వారి మిత్రులతో కలిసి గ్రామ శివారులోని కొండవీడు కొండల సమీపంలో మంగళవారం మద్యం సేవించేందుకు వెళ్లారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ప్రశాంత్‌పై ప్రేమ్‌చంద్ చేయి చేసుకున్నాడు. విషయం ప్రశాంత కుటుంబ సభ్యులకు తెలిసి అతని తండ్రి ఏసుబాబు ఊరిలోని చర్చివద్ద ఉన్న ప్రేమ్‌చంద్‌ను ప్రశ్నించడంతో తిరిగి ఏసుబాబుపై కూడా దాడి చేశారు. బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు.

నూరుశాతం ఫలితాల సాధనకు చర్యలు



శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో ప్రభుత్వం ఈవిద్యా సంవత్సరంలో నూతనంగా బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయటంతో నూరు శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు తమవంతు తర్ఫీదు ఇస్తున్నట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కృషి ఫలితంగా బాలికల జూనియర్ కళాశాల వచ్చిందన్నారు. ఎంపీటీసీ-20, బైపీసీ-13 మంది బాలికలు చదువుతున్నారన్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి అయిందని విద్యార్థులను గ్రేడుల వారీగా విభజించి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి అందరు ఉత్తీర్ణత అయ్యేలా 07 మంది ఉపాధ్యాయులు సబ్జెట్స్ వారీగా విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు.